

# మాయాబజార్

సి. ఆనందారామం

సోఫాలో కూచుని ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు జయప్రభ– అలా మాట్లాడుతోనే ఎదురుగా కూచున్న వ్యక్తికి ఏదో సైగచేస్తున్నాడు– అలా సైగచేస్తూనే అటువైపు మోగిన మరో ఫోన్ అందుకుని "హలో!" అనేసాడు, ఇటు ఫోన్‌లో వినిపించకుండా.

ఆ సమయంలో వచ్చాడు వినాయక్– అతడిని చూడగానే మాట్లాడుతున్న రెండు ఫోన్లూ క్రేడిల్స్‌లో పెట్టేసాడు, మాటలు మధ్యలోనే ఆపేసి, సంభ్రమంగా ఎదురెళ్ళి సగౌరవంగా ఆహ్వానించాడు. అతడు తప్ప తనకు మిగిలిన లోకంతో పనిలేదన్నట్లు ఆ గదిలో ఉన్న మిగిలిన వ్యక్తుల నెవరినీ చూడకుండా, "మీరే స్వయంగా దయచేసారు– ఏవిటి విశేషం? కాస్త కాఫీ పుచ్చుకుంటారా? ఒరేయ్ భీముడూ! ఇంట్లో చెప్పి ఓ కప్పు కాఫీ తీసుకురారా!" అనేసాడు గుక్కతిప్పుకోకుండా.

ఈ మర్యాదని వినాయక్ కూడా అంతే ఆదరంగా స్వీకరించాడు–

"ఇప్పుడు కాఫీగీఫీ ఏం వొద్దండీ! మనలో మనకి మర్యాద లేమిటి? ఒక చిన్న సహాయం కావాలి!"

"అమ్మమ్మ? ఎంత మాట! సెలవీయండి! మీరు అడగడమూ, నేను కాదనటమూనా? మీ కోసం ఏదైనా సాధించి పెడతాను–"

లేని మీసంమీద చెయ్యి వేసుకొన్నాడు జయప్రభ–

"నాకు తెలీదుటండీ! అందుకేగా మీ దగ్గిరకి వస్తే! మా అమ్మాయి కామాక్షి మీకు తెలుసుగా?"

"అయ్యో! తెలియకపోవటం ఏమిటి? కుందనపు బొమ్మలా ఉంటుంది!"

"అంతేకాదండీ! బాగా చదువుతుంది. చిన్నప్పుడంతా ప్రతి క్లాసులోనూ ఫస్టే! ఈ ఇంటర్‌లో మాత్రం వెధవ కంప్యూటర్ కల్లోలాలతో సెకండ్ క్లాసులో పాసయింది. యం.బి.బి.యస్. యెంట్రెన్స్ రాసింది–"

"ఇంకేం! తప్పకుండా మీ అమ్మాయికి సీటు వచ్చేస్తుంది–"

"రావలసిందేనండి! కానీ, ఈకంప్యూటర్లని నమ్మకోటానికి లేదు– తెలివైనవాళ్ళని అడుగుకు తోసేస్తోంది– చవటల నందరినీ పైకి తెస్తోంది– తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం కంటే, ముందు జాగ్రత్తలో ఉండటం మంచిది కదండీ!"

"అవునవును!"

వెనకటి హుషారు లేదు జయప్రభ గొంతులో. అసలు విషయం చెప్పమన్నట్లు చూసాడు.

"హెల్త్ మినిస్టర్ మనకు కావలసిన వాడే! నా మాట కాదనడు! ఇదివరలో ఎన్నో సాయాలు చేసాడు– ఎన్నికలలో అతడికి కుడిభుజాన్ని నేనే! కానీ, సొంత కూతురికోసం అడగాలంటే చిన్నతనంగా ఉంది. చనువుకొద్దీ 'ఏమిటయ్యా! నీ కూతురు ఆ మాత్రం సీట్ తెచ్చుకోలేదా?' అంటే ప్రాణం పోయినట్లు ఉంటుంది. అందుకని మీ దగ్గిర కొచ్చాను– మీ రెలాగయినా ఈసారి మా అమ్మాయికి సీట్ తెప్పించి పెట్టాలి!"

"ఈ సారి" అంటున్నారు– ఇది ఎన్నోసారేమిటి?"

"ఆ! ఇదివరలో రెండుసార్లు అపియర్ అయింది. ఈ కంప్యూటర్ గొడవలతో సీట్ రాలేదు."

జయప్రభకి విషయం అర్థమయిపోయింది.

"అంతేనండి! మనవాళ్ళకి ఏఒక్కటీ చేతకాదు. సరే! ఈ విషయం నేను చూసుకుంటాలెండి!"

"హమ్మయ్య గుండెలమీది నుంచి పెద్ద బరువు దింపేసారు– 'నేను చూసుకుంటాను–' అని మీరనటంకంటే కావలసిన దేముందీ? ఇక పని అయిపోయినట్లే!"

"అంతే! అది సరే కాని, మా సీతాపతి కొడుకు ఉద్యోగం సంగతి ఏంచేసారు?"

"ఏదీ, ఆ కార్పొరేషన్‌లో ఉద్యోగం సంగతేనా?"

"అవునండీ! మరిచిపోయారా?"

"భలేవారు. మరిచిపోవటం ఏమి టండీ! అప్పుడే డైరెక్టర్‌కి చెప్పేసాను- ఎటొచ్చీ బొత్తిగా బి.ఏ ఫెయిల్డ్ కాండి డేట్ కావటంవల్ల కొంచెం కష్టం అవు తుందన్నారు- నేను గట్టిగా చెప్పిన మీదటతప్పకుండాప్రయత్నిస్తానన్నారు."

"ప్రయత్నించడం కాదు- తప్ప కుండా ఆ ఉద్యోగం వాడికి వచ్చేలా చూడాలి! కావాలంటే కాస్త చెయ్యి తడి చేద్దాం!"


"అలాంటివన్నీ నే చూసుకుంటా లెండి- మీవాడికి ఉద్యోగం తెప్పించే పూచీ నాది! మీరు మాత్రం అమ్మాయి సీట్ సంగతి చూడండి, పేరు శ్రీలత- రిజిస్ట్రేషన్ నంబరు 82715-రాసుకోండి!"

"అలాగే! ఇప్పుడే రాసుకుంటాను-"

జయద్రథ నోట్‌చేసుకున్నాక సంతృప్తిగా వెళ్ళిపోయాడు వినాయక్.

ఆ సాయంత్రమే జయద్రథ గోవింద నారాయణ్ ఇంటికి వెళ్ళాడు. ఆ సమ యానికి అతడి ఇంట్లో అరడజను గాంధీ టోపీలు కుర్చీల్లో కూచుని ఉన్నాయి. బీడీలమీద చుట్టలు కాల్చుకుంటూ, కొందరు గూడెం నాయకులు కూచుని గొత్తెల్లా తల ఊపుతున్నారు, తాము ఏం వింటున్నదీ కూడా పట్టించుకోకుండా.

అందరూ ఏవో అతి ముఖ్యమైన విషయాలు చర్చించుకుంటున్నారు. బహుశః ఈ దేశాన్ని ఇంకా ఎన్ని రకాలుగా ఎలా ఉద్ధరిద్దామా, అని కావచ్చు....




జయద్రథని చూచి గోవింద నారాయణ మాట్లాడుతున్నది ఆపి ఎదురెళ్ళితీసుకొచ్చికూచో పెట్టాడు.

నవ్వుతూ కన్ను కొట్టి "మందు తీసుకోటానికి అభ్యంతరం లేదుగా?" అని అడిగి- అభ్యంతరం ఉండదని తనకు తెలుసునన్నాడు- అతనికీ ఒక గ్లాసు అందించాడు. అక్కడి గాంధీ టోపీలందరి చేతుల్లో తలో గ్లాసూ ఉంచి. అన్నట్లు ఇప్పుడు జయద్రథ నెత్తిమీద కూడా ఒక గాంధీటోపీ ఉంది. అతడు బయటికీ వచ్చినప్పుడు ఎప్పుడూ గాంధీ టోపీతోనే ఉంటాడు- ఏవేవో కులాసా కబుర్లయ్యాక "మీరు నాకో చిన్న సహా యం చెయ్యాలండీ గోవిందనారాయణ్ గారూ!" అన్నాడు జయద్రథ....

"చెప్పండి- నాకూ మీతో ఒక పని ఉంది. నేనే మీ దగ్గర కొద్దామనుకొం టూంటే వెదకబోయిన తీగె కాలికి తగినట్లు మీరే నాకాడికొచ్చారు. ముందు మీ పని చెప్పండి."

"చాలా చిన్న సహాయం-ఒకమ్మాయికి మెడిసిన్‌లో సీట్ రావాలి!"

"ఓ, గాడ్! ఇది చిన్న సహాయమంటా రేంటండీ! ఒక్క మెడిసిన్ సీటు లక్షకి పైగా పలుకుతోంది తెలుసా?"

"గోవిందనారాయణ్ పల్లెటూరి మోతుబరి రైతు- అతడి మాటల్లో పెద్ద చదువులు లేని అనాగరకత స్పష్టంగా తెలుస్తుంది. అయినా "ఓ గాడ్!" "రియల్లీ!" "నాన్సెన్స్!" "బాస్టర్డ్"- లాంటి సంస్కారపు పడికట్టు రాళ్ళను తరచుగా వాడుతుంటాడు, సందర్భం ఉన్నా, లేకపోయినా....

ఒక గుటక మింగాడు జయబ్రధ-

"మెడిసిన్ సీటు ధర లక్షకి పైగానే పలుకుతోందని తెలుసండీ! అయినా మీ బోటివారు పూనుకుంటే కూడా అంత చెల్లించుకోవాలా?"

"ట్రై చెయ్యాలి! ఎట్లాగో తంటాలు పడొచ్చులెండి-"

"అది తెలిసేకదండీ, మీ దగ్గర కొచ్చాను-?"

"సూద్దారిలెండి! విలాస్ నగర్‌లో హౌసింగ్ కాంప్లెక్స్ లేవబోతన్నా దంటగా! యిన్నారా?"

"విన్నాను- ఏదో భారీఎత్తున్న కట్ట బోతున్నారుట!"

"ఆ కాంట్రాక్టు సీతారామయ్య కొచ్చేలా సూడగలారా? మనోడే! 'చిట్టి చెదలూరు' ఓట్లన్నీ ఆడి సేతుల్లోనే ఉన్నాయ్!"

"ప్రయత్నిస్తాను- మీరు మాత్రం ఆ అమ్మాయి మెడిసిన్ సీటు మాట మరిచి పోకండి. పేరు శ్రీలత. రిజిస్ట్రేషన్ నంబరు 82715-"

గోవిందనారాయణ్ ఆ వివరాలు నోట్‌చేసుకున్నాక చేతిలో గ్లాసు ఖాళీచేసి వెళ్ళిపోయాడు జయబ్రధ-

రాష్ట్రాన్ని విజిట్ చెయ్యటానికి ప్రధానమంత్రిగారి తోడల్లుడి పెద్ద బావ మరిది వస్తున్నాడు. ఆయనకి ఘనసన్మానం చెయ్యటానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాడు, స్వాహానాథ్- ఒక సన్మాన సంఘం ఏర్పాటు చేసాడు. ఆ సంఘంలో ప్రముఖు లందరి పేర్లూ ఇరికించాడు. పెద్ద అట్టహాసంగా చర్చలు జరుపు తున్నాడు- ఆ చర్చల్లో తను పోగుచేసిన విరాళాల వివరాలు రాకుండా జాగ్రత్త పడుతున్నాడు- ఆ సమయంలో వెళ్ళాడు గోవిందనారాయణ్ అతడి దగ్గరకి....

"రండి! రండి! సన్మాన సంఘంలో మీ పేరు కూడా చేర్పిస్తున్నాను- కాదన కూడదు" అంటూ ఆహ్వానించాడు స్వాహా.

గోవింద పొంగిపోయాడు- ఆ లిస్ట్ అప్పుడే కొల్లేటి చాంతాడంత పొడుగు వుందని అతడికి తెలీదు.

"మీ రేస్తానంటే కాదంటానేంటి?" అని నవ్వాడు. మామూలు కుశల ప్రశ్న లయ్యాక తను వచ్చిన పని బయట పెట్టాడు-

"ఒకమ్మాయికి మెడిసిన్‌లో సీట్ కావాలి! మీరు కూసింత గట్టిగా ట్రైచేసి తెప్పించాలి?"

"హమ్మనాయనో! మెడిసిన్‌లో సీటే! ఆ సీట్లకోసం ఎంత పొడుగు క్యూవుందో తెలుసా?"

"తెలవదేంటండీ! అందుకేగంద! మీ కాడికొచ్చింది? యిన్నోటి సన్మానాలు సేయిత్తన్నారు. వాట్టినేటండీ!"

గర్వంగా చిద్విలాసంగా నవ్వాడు స్వాహా!

"సరే, చూద్దాం, కానీ, ఈ సన్మానానికి మీ రెలాగయినా ఓ లక్ష పోగుచెయ్యాలి!"

గోవింద మోకాళ్ళు వణికాయి. నీర సించిపోయాడు-

"లక్షా? ఎవడిస్తాడండీ?"

"ఎవ్వడూ ఇవ్వడు! ఇచ్చేలా చెయ్య టమే మన గొప్పతనం! మనకోసమా ఏమిటండీ! మన ప్రధానమంత్రిగారి తోడల్లుడి పెద్ద బావమరిది కోసం! ఆ మాత్రం రాజభక్తి లేకపోతే ఎలా?"

"సరే! సూత్తాను. మీరు రాస్కోండి- ఆ యమ్మాయి పేరు శ్రీలత. రిజిస్ట్రేషన్ నంబరు 82715."

స్వాహా రాసుకున్నాక వెళ్ళిపోయాడు గోవింద.

వినాయక్ వరండాలో చాలామంది సంఘసేవకులు, సేవికలు, గుమికూడి ఉన్నారు. వాళ్ళందరి మధ్య చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతున్నాడు. ప్రధాన సంఘసేవకుడు వినాయక్- గొంతు సవరించుకుని గంభీరంగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

"ఈనాడు మన దేశం ఈ స్థితిలో ఉండ టానికి ప్రధాన కారణం నిరక్షరాస్యత- దానిని నిర్మూలించాలి! పల్లెపల్లెలో ఒక బడి పెట్టాలి-"

అతడి గంభీరోపన్యాసానికి ఒకడు అడ్డుతగిలాడు.

"గవర్నమెంటోళ్ళు బడి పెట్టారు గదండీ!"

వినాయక్ విసుక్కున్నాడు- అనవస రంగా అడ్డుపడినందుకు-

"ఆ! పెట్టారు లేవయ్యా! బడుంటే పంతులుండడు. పంతులుంటే పిల్ల లుండరు- పంతులూ, పిల్లలూ ఉంటే బడే ఉండదు- అలా ఉన్నాయి మన బళ్ళూ- మన చదువులూ-

'అందుకే ప్రయత్నాలన్నీ పేపర్ల మీద__ చదువూ చట్టుబండలూ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే- అన్నట్లున్నాయి-

"అయినా ప్రభుత్వాన్ని అని ప్రయో జనం లేదు-

"పాపం ప్రభుత్వం ఒక్కటీ ఎన్ని పన్లని చేస్తుందీ? ఈ ప్రజాప్రభుత్వ యుగంలో ప్రజలే ప్రభుత్వం! అంచేత మన సమస్యలు పరిష్కరించుకోవటానికి మనమే పూనుకోవాలి! అందుకే మీ అందరి సహకారంతో ప్రతిపత్తితోనూ ఒక పాఠశాల నేనే నడపాలనుకుంటున్నాను- సమర్థులైన ఉపాధ్యాయులు కావాలని పత్రికలలో ప్రకటనలియ్యండి. బి.ఏ పాసుకాకపోయినా ఫరవాలేదు- చక్కగా పిల్లలకి పాఠాలు చెప్పగలిగితే చాలు! నెలకి తొమ్మిది వందలు జీతం—"

మళ్ళీ మరొకరు అడ్డుపడ్డారు-

"అమ్మబాబోయ్! ప్రైమరీస్కూల్ టీచర్‌కి తొమ్మిదొందలు జీతమా?"

"ఇయ్యాలయ్యా! ఆ మాత్రం జీతం లేకపోతే ఈ రోజుల్లో ఎలా బతగ్గలరూ? వాళ్ళు కడుపునిండా తినకపోతే పిల్లలకేం చెప్పగలరు? అన్నట్లు ప్రతి అప్లికేషన్‌తోనూ పది రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు పంపాలని కూడా రాయండి!"

"అదెందుకండోయ్?"

"ఉండాలయ్యా! ఆ నిబంధన లేకపోతే అడ్డమైనవాడూ అప్లికేషన్ పడేస్తాడు. ఎంచుకోలేక మనం అవస్థపడాలి! అదీగాక మనం పెట్టబోయే బళ్ళకు గవర్నమెంట్ ఆర్థికసహాయం అందజేసేవరకు ప్రారంభంలో మన దగ్గిర డబ్బుండాలిగా?—"

అప్పు డర్థమైపోయింది అతనికి-

"ఆహా! ఏం సంఘసేవ!"

పరవశించిపోయాడు, తమ నాయకుడికి ప్రజలమీద గల అభిమానానికి-

ఆ సమయంలో వచ్చాడు స్వాహా— పరస్పరం సగౌరవంగా అభినందించు




కున్నాక ఒకరి కార్యక్రమాలు మరొకరు తెలుసుకున్నారు.

"ఎలాగైనా మీది పెద్ద చెయ్యి-" ఒప్పేసుకున్నాడు స్వాహా!

"ఏముందిలెండి!" అని వినయం ప్రకటించాడు వినాయక్.

"మీకు హెల్త్ మినిస్టర్‌గారు బాగా పరిచయం కదూ!"

అసలు పనిలోకి దిగాడు స్వాహా....

"ఆహా! ఎంతో సన్నిహితులు! మా మాట ఆయన కాదనటం ఎప్పుడూ లేదు...."

"అదే విన్నాను- ఒకమ్మాయికి మెడిసిన్‌లో సీట్ కావాలి. ఇప్పించగలరా?"

"అమ్మో! అది లక్షలతో పని- అయినా ప్రయత్నిస్తే పని జరగకపోదనుకోండి- చూద్దాం! మేము పెట్టబోయే స్కూల్స్ అన్నింటికీ రికగ్నిషన్స్ తెప్పించగలరా?"

"ఇంకా పెట్టలేదు కదండీ!"

"కాగితాలు సిద్ధంగా ఉన్నాయి, అన్ని హంగులతో .... ప్రస్తుతానికి ప్రతి ఊళ్ళోనూ ఏదో ఒకటి చూపించొచ్చు, నామమాత్రపు బడిగా.... తరువాత నిజంగా పాఠశాలా భవనాలకు శంఖుస్థాపన విషయం ఆలోచించుకోవచ్చు-"

"బాబో! దేవాంతకులండీ! సరే, అలాగే చూద్దాం. కానీ, అమ్మాయి మెడిసిన్ సీట్ విషయం గట్టిగా ప్రయత్నించండి- నోట్‌చేసుకోండి- పేరు శ్రీలత. రిజిస్ట్రేషన్ నంబర్- 82715."

పెన్ తీసి డైరీలో నోట్‌చేసుకోబోయిన వినాయక్ తెల్లబోయి చూసాడు-

తనే చాలా గొప్ప మాయలమరాఠీ ననుకుంటున్నాడు. అతనికంటే ఘనుడు....

నోట్ చేసుకోకుండా తనను తెల్లబోయి చూస్తున్న వినాయక్‌ని చూసి స్వాహా తెల్లబోయాడు-

తెల్లబోయిన ఆ ఇద్దరు ప్రజానాయకులనీ చూసి మిగిలినవాళ్ళందరూ తెల్లబోయారు-

ఏమాత్రం తెల్లబోకుండా నల్లగా మిగిలిపోయింది ఒక్కటే!

అది, ఆంధ్రదేశం.